రహదారి ఇలా.. ప్రయాణం ఎలా?

గుంతలతో ప్రయాణికుల ఇక్కట్లు

టి.నరసాపురం: రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణాలు చేయాలంటేనే భయపడే స్థితిలో ఉండగా, వాహనదారులు తమ వాహనాలను బయటకు తీయడానికి కూడా జంకుతున్నారు. ముఖ్యంగా టి.నరసాపురం-చింతలపూడి ప్రధాన రహదారి గోతుల మయంగా ఉంది. ఈ రహదారిలో ఎటుచూసినా గోతులే. రోడ్డు అనేది మచ్చుకైనా కనిపించదు. ఒక్కొక్క గొయ్యి గజం లోతులో ఉండడంతో, ఈ గోతులు వర్షం పడినప్పుడు స్విమ్మింగ్ పూల్స్‌ను తలపిస్తున్నాయి. వర్షం నీరు ఉన్నప్పుడు గొయ్యి ఎంత లోతు ఉందో కూడా అర్థం కాక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. టి.నరసాపురం నుంచి చింతలపూడి వరకు 10 కిలోమీటర్ల దూరం పది నిమిషాల్లో చేయాల్సిన ప్రయాణం గంటసేపు పడుతుంది. ఈ రహదారిలో నాలుగు చక్రాల వాహనంపై వెళ్లే కన్నా నడిచి వెళ్లడం మేలని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రహదారి గోతుల మయంగా మారడంతో ప్రయాణికులు ఇంటికి క్షేమంగా వచ్చే వరకు నమ్మకం ఉండడం లేదు. ట్రాక్టర్లు, వాహనాలు పల్టీ కొట్టడం సర్వ సాధారణమైపోయింది. పోలవరం నియోజకవర్గాన్ని, చింతలపూడి నియోజకవర్గాన్ని కలిపే ఈ రహదారి అభివృద్ధి విషయంలో ఇటు పోలవరం నాయకులు కానీ అటు చింతలపూడి నాయకులు కానీ దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.ఇది ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. ఈ రహదారి రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డులో ప్రయాణం నరకప్రాయం కావడం, గంటకు పైగా సమయం పడుతుండడంతో కొందరు వాహనదారులు నిర్మాణంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే ద్వారా ప్రత్యామ్నాయంగా ప్రయాణిస్తున్నారు. చింతలపూడి-టి.నరసాపురం రహదారిని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా గోతులను పూడ్చి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



టి.నరసాపురం - చింతలపూడి ప్రధాన రహదారిలో ఏర్పడిన భారీ గోతులు

రహదారి అధ్వానంగా ఉంది



చింతలపూడి-టి.నరసాపురం రోడ్డు అధ్వానంగా ఉంది. భారీ గుంతలతో వాహనాలు నడపడానికి ఇబ్బందిగా ఉంది. ఈ రహదారిలో ప్రయాణం చాలా సమయం పడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో చింతలపూడి వెళ్లాలనుకునే వారికి ప్రయాణం పెద్ద సంకటంగా సాగుతుంది. చింతలపూడి, పోలవరం నియోజకవర్గాలను కలిపే రహదారి కావడంతో ఎవరూ సరిగా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చింతలపూడి-టి.నరసాపురం ప్రధాన రహదారిని పునర్నిర్మించాలి.

– బిక్కి సైదయ్య, టి.నరసాపురం

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు బుధవారం రూ.1,00,116 లను విరాళంగా అందజేశారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన కలగర శేషగిరిరావు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

రేపటి నుంచి గ్రామసభలు

కొయ్యలగూడెం: మండల వ్యాప్తంగా 23వ తేదీ నుంచి నిర్వహించే గ్రామ సభలలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొనాలని ఏపీవో నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్ని పంచాయతీల పరిధిలో పనులను గుర్తించాలని పంచాయతీ తీర్మానం, అదే విధంగా మండల పరిషత్ తీర్మానాల ప్రక్రియ విధానంపై సూచనలు చేశారు. అనంతరం గ్రామ కార్యదర్శులతో ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జంగారెడ్డిగూడెం రూరల్: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, నీటి నిల్వల వలన దోమలు పెరిగి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీల్లో మురుగు, వీధుల్లో చెత్త, చెదారం తొలగించారు. ఈ పనులను ఉప సర్పంచ్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ఆర్థిక స్వావలంబన సదస్సు ఏర్పాటు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురంలో బుధవారం పీపుల్స్ మాక్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక స్వావలంబన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ మహిళలకు అందిస్తున్న పొదుపు పథకాలు, సొసైటీలు అందిస్తున్న రుణాలు ఆర్థిక స్వాలంబనకు తోడ్పడుతాయన్నారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ గోపాలకృష్ణ, రైతు నాయకులు ఎలికే వర ప్రసాద్, మాజీ ఎంపీటీసీ సభ్యులు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై దాడిని ఖండించిన వైఎస్సార్‌సీపీ

టి.నరసాపురం: భారత్ బంద్ నేపథ్యంలో మండలంలోని బంధంచర్లలో యువకుడిపై కత్తి దాడిని వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్రీను రాజు విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ దళిత సంఘాలు ప్రశాంతంగా బంద్‌ను నిర్వహిస్తున్న సమయంలో ఇటువంటి ఘటన బాధాకరమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులు నీచనమైన, హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. కత్తిదాడిలో గాయపడిన యువకుడు మారుమూడి పవన్‌ను ఫోన్‌లో ఆయన పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఘటనకు కారణమైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని పంగిడిగూడెం గ్రామ శివారులో బుధవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 5 గురు జూదరులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ.40,200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రత్యేక చట్టం చేయాలి

కుక్కునూరు: ఏజెన్సీలో గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రత్యేక చట్టం చేయాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి వంజం ధర్మరాజు అన్నారు. బుధవారం కుక్కునూరులో ఏటీఏ డివిజన్ లెవల్ జనరల్ బాడీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ధర్మరాజు మాట్లాడుతూ నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో 1986 లో జాతీయ విద్యా విధానం అనుసరించి ప్రభుత్వం జీఓఎంఎస్ నెంబర్ 275 ను తీసుకొచ్చిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రత్యేక చట్టం చేసి ఆదివాసీలను రక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

–ఏటీఏ కమిటీ నియామకం

ఏటీఏ జిల్లా నాయకులు సీతారామయ్య ఆధ్వర్యంలో ఏటీఏ మండల కమిటీని ఎంపిక చేశారు. ఏటీఏ మండల అధ్యక్షుడిగా సోడే వెంకటనారాయణ, ప్రధాన కార్యదర్శిగా తుర్సం వినోద్, కోశాధికారిగా బొడ్డు రాజు, సహాయ కార్యదర్శిగా రవ్వా శ్రీకాంత్, ప్రచార కార్యదర్శులుగా కొవ్వాసి కిరణ్, రసా లక్ష్మణ్, మహిళా కార్యదర్శులుగా కొలూరి లక్ష్మీ, కిచ్చెల అక్కమ్మ, సిదరా రాధా, తదితరులను ఈ సందర్భంగా ఎన్నుకున్నారు.

వరద బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలి

కుక్కునూరు: పెదవాగు ప్రాజెక్ట్ తెగిపోయి బాధపడుతున్న నిర్వాసితులకు వరద ఉన్న నాలుగురోజులు ఒక పూట తిండి పెట్టి కాలం గడిపారే తప్ప ప్రభుత్వం నిర్వాసితులకు ఎటువంటి సహాయ కార్యక్రమాలు చేయలేదని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ జంగారెడ్డిగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్‌కే గౌస్ విమర్శించారు. వరదలో ఇళ్లు కొట్టుకుపోయిన వారికి నష్ట పరిహారం అందించాలన్నారు. ఆగస్టు 22న చలో అసెంబ్లీ కార్యక్రమంలో భాగంగా పోలవరం నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో, మౌలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు, కట్టం వీరస్వామి పాల్గొన్నారు.

అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి

బుట్టాయగూడెం: అత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి డిమాండ్ చేశారు. కలకత్తాలో ట్రైనీ డాక్టర్ మౌమిత అత్యాచారం, హత్య దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) యువజన సంఘం (పీవైఎల్) సంఘాల ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్లో నిర్వహించిన సభలో పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి, డివిజన్ అధ్యక్షురాలు కారం లక్ష్మి, పీవైఎల్ జిల్లా నాయకులు తగరం బాబురావులు మాట్లాడారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వెట్టి సుబ్బన్న, కారం రాఘవ, ఇష్టా రాష్ట్ర నాయకులు కేవీ రమణ, ఎస్.రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మౌమితకు నివాళులు

కొయ్యలగూడెం: వైద్య విద్యార్థిని మౌమిత ఆత్మకి శాంతి చేకూర్చాలంటూ కొయ్యలగూడెంలో ప్రజలు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులను వెలిగించి జాతీయ ప్రధాన రహదారిపై అదే విధంగా కన్నాపురం తాడేపల్లిగూడెం రోడ్లలో మౌన ప్రదర్శన చేపట్టారు. తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వర్తక వ్యాపార సంఘాలవారు తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో ర్యాలీ

వేలేరుపాడు: ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం చేసిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ నాయులు డిమాండ్‌చేశారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహసిల్దార్ కార్యాలయం వరకు కళ్లకు గంతలు కట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ మండల అధ్యక్షులు సువేటి లత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సీఐటీయూ మండల కార్యదర్శి బోగారి వెంకటేశ్వర్లు. మండల కమిటీ సభ్యులు కన్నం నరసమ్మ, మడకం నాగమణి, సన్యాసి సుధారాణి, పిట్టా ముత్తమ్మ, సుజాత, వెంకమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన సొంగా సందీప్



వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన సొంగా సందీప్

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని లింగపాలెం మండలానికి చెందిన మాజీ లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ శుక్రవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిరునవ్వుతో పలకరించడంతో పాటు, చింతలపూడి నియోజకవర్గ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారన్నారు. రాబోయే రోజుల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని తెలిపారన్నారు. అప్పటి వరకు కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారన్నారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ వారిని చైతన్య పరచాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు చెప్పారు.

నేత్రపర్వంగా సువర్చలా హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: ఆంజనేయ స్వామి జన్మ నక్షత్రం పూర్వాభాద్ర నక్షత్రం కావడంతో మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో బుధవారం సువర్చలా హనుమద్ కల్యాణం నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు ఘనంగా స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు, ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, పాల్గొన్నారు.

నేడు విగ్రహావిష్కరణ

జంగారెడ్డిగూడెం: పారిజాతగిరిలో గురువారం ఉదయం 8:45 నిమిషాలకు గోకుల ఉద్యానవనం చెంత నిర్మించబడిన అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఈవో మానికల రాంబాబు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన కానూరు శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేకంగా ఈ విగ్రహాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా విశేష అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

రహదారులను పునర్నిర్మించాలి

వేలేరుపాడు: వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లను పునర్నిర్మాణం చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు కోరారు. వేలేరుపాడులో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కుక్కునూరు మండలం లంకాలపల్లి నుంచి వెంకటాపురం వరకు గోతులు పడిన 35 కిలోమీటర్ల ఆర్అండ్‌బీ రోడ్డుపై, కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. తెగిపోయిన దాచారం గుండేటి వాగు బ్రిడ్జి పునర్నిర్మాణం చేయాలన్నారు. సమావేశంలో ప్రముఖ కవి డాక్టర్ ముత్యానికి నివాళులర్పించారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు, కట్టమ్ వీరా స్వామి పాల్గొన్నారు.

దళితులపై కేసులు ఉపసంహరించుకోండి

చింతలపూడి: టి నరసాపురం పోలీస్ స్టేషన్‌లో 25 మంది దళిత యువకులపై పెట్టిన కేసులను తక్షణం పోలీసులు ఉపసంహరించుకోవాలని మాజీ ఎంపీ హర్షకుమార్ డిమాండ్ చేశారు. భారత్ బంద్ కార్యక్రమంలో కత్తిపోట్లకు గురై చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మారుమూడి పవన్‌ను హర్షకుమార్ పరామర్శించారు. దేశవ్యాప్తంగా బంద్ విజయవంతం అయ్యిందని, టి.నరసాపురంలో తప్ప ఎక్కడా అవాంఛనీయమైన సంఘటనా జరగలేదన్నారు. కేసులు ఎత్తివేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చింతలపూడి: వేగంగా ప్రబలుతున్న జ్వరాల పట్ల వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. పారామెడికల్ సిబ్బంది తరచూ తమ పరిధిలోని గృహాలను సందర్శించాలన్నారు. జ్వర పీడితులను గుర్తించి తగిన వైద్య సేవలు అందించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. చింతలపూడి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని భట్టువారిగూడెం, సమ్మెటవారిగూడెం, రాఘవాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్రాగునీటి క్లోరినేషన్, పరిసరాల పారిశుధ్యం, డ్రైనేజీల నిర్వహణపై గ్రామ పంచాయతీలు, నగర పంచాయతీలు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలను నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారులు కె.కిరణ్ చైతన్య, కె.అనిల్ కుమార్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీనారాయణ

వ్యవసాయాధికారుల పర్యటన

లింగపాలెం: మండలంలోని సింగూడెంలో వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం పర్యటించారు. ఏలూరు ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె.ఫణికుమార్, విజయరాయి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పీవీ రమణారావు, ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నాగేంద్రబాబు పర్యటించి పత్తి పంటలను పరిశీలించారు. రైతులకు పత్తి పంట సాగులో మెళకువలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల పంట ఎదుగుదల సరిగా లేదని, అయితే వర్షాలు తగ్గుముఖం పట్టడం వల్ల ఎదుగుదల పుంజుకుంటుందన్నారు. పత్తి పంటలో ప్రధానంగా పచ్చదోమ ఉందని వాటి నివారణకు ఇమిడాక్లోరైడ్ 17.8 ఎస్ఎల్ మందును లీటరు నీటికి, 0.5 మిల్లీ లీటర్ల అసిటిమాప్రిడ్ మందును లీటరు నీటికి 0.2 గ్రాములు లేదా తయోమిథాక్సమ్ 25 డబ్ల్యూజీ మందును లీటరు నీటికి 0.2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



ప్రత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

గ్రామ సభలు పారదర్శకంగా నిర్వహించాలి

జంగారెడ్డిగూడెం: మండలంలో ఈ నెల 23న ఉపాధి హామీ గ్రామ సభలను పారదర్శకంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం మండల అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. మండల అధ్యక్షురాలు వై.సీత అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల కార్యదర్శి ఎ.ప్రభాకర్‌రావుతో కలిసి జీవరత్నం మాట్లాడుతూ మండల ఎంపీడీవో ఉపాధి హామీ కూలీలు పాల్గొనేలా దండోరా వేయించి, గ్రామసభల్లో కూలీలు చేసే పనులు చర్చించి తీర్మానం చేయించాలన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి పనులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఒకేరోజు నిర్వహిస్తున్న గ్రామసభల్లో కూలీలకు అనుగుణంగా పనులు ఎంపిక చేసి, ఆమోదం తెలిపి, పనులు నిర్ణయించుకోవటానికి ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జోడే సూర్యచంద్రరావు, వామిశెట్టి నరసరావు, సీహెచ్ లక్ష్మీనారాయణ, పి.చంటి, నిట్టా నాగరాజు, కె.వెంకటేష్, ఎం.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవరత్నం

పారిశుధ్యం మెరుగు పరచాలి

కామవరపుకోట: వర్షాల కారణంగా వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్యం మెరుగు పరచాలని జెడ్పీటీసీ కడిమి రమేష్ అన్నారు. బుధవారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో వైస్ ఎంపీపీ కనికెళ్ల రత్నకుమారి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏడి కాసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య గర్ యోజన పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో అందిస్తున్న సోలార్ రూఫ్ నిర్మించుకొని ప్రజలు వినియోగించుకోవాలని, దీంతో విద్యుత్‌కు డిమాండ్ తగ్గి, కరెంటు బిల్లు తక్కువగా వచ్చే ఈ సందర్భంగా జెడ్పీటీసీ కడిమి రమేష్ మాట్లాడుతూ భారీ వర్షాలతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ఉన్నాయని వాటిని నివారించేందుకు వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీడీవో కె.శ్రీదేవి, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, తహసిల్దార్ జి.ఎలీషా, సర్పంచులు, ఎంపీటీసీలు, మండలాధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ద్వారకాతిరుమల: మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలోని తూర్పు వీధిలో తాగునీటి సమస్య ఆ ప్రాంత వాసులను వేధిస్తోంది. నెల రోజులుగా ఈ సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పంచాయతీ అధికారులు, పాలకవర్గం బోర్లు, మోటార్లు మరమ్మతులకు గురయ్యాయని చెప్పడమే మినహా పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు శూన్యమని స్థానికులు ధ్వజమెత్తారు.

తాగునీరు కలుషితం

కొయ్యలగూడెం: తాగునీరు కలుషితం అవుతోందని సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కరించడం లేదని దిప్పకాయలపాడు గ్రామస్తులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని గొల్లగూడెం ప్రాంతంలో తాగునీటి వాటర్ ట్యాంక్ నుంచి కలుషిత నీరు సరఫరా అవుతుందన్నారు. సుమారు నెల రోజుల నుంచి నీరు తాగడానికి ఉపయోగ పడడం లేదని, ఆర్వో వాటర్ ప్లాంట్లను ఆశ్రయించి, తాగునీరు కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు దాహార్తిగా ఇదే నీరు తీసుకోగా, రోగాల బారిన పడ్డారన్నారు. ఈ నేపథ్యంలో కొందరు యువకులు ట్యాంక్ పైకి ఎక్కి అడుగుభాగానికి దిగగా, అందులో పేరుకుపోయిన మట్టి పెళ్లలు ఉండడాన్ని గమనించారు. దీంతో వారు వాడకం నీరుగా కూడా ఉపయోగించకూడదని చాటింపు వేయించారు. ఈ నేపథ్యంలో సమస్యను సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



వాటర్ ట్యాంకు అడుగు భాగంలో పేరుకుపోయిన మురుగుమట్టి

ముగిసిన రిఫ్రెషర్ శిక్షణ తరగతులు



ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

కొయ్యలగూడెం: రిఫ్రెషర్ శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులు ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమాలు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు నిర్వహించారు. చివరి రోజున వీధి దీపాల నిర్వహణ, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయుటకు శిక్షణ అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఇన్‌చార్జి) జి.సతీష్, కోర్స్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. ట్రైనింగ్ టీఓటీ గోపాలపురం మండలం కార్యదర్శి సురేష్, పొంగుటూరు కార్యదర్శి కె.నాగేశ్వరరావు, వేదాంతపురం కార్యదర్శి తాతబాబు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీల మధ్య చిచ్చుకే వర్గీకరణ



బంద్ నేపథ్యంలో పహారా కాస్తున్న పోలీసులు



రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు

ప్రశాంతంగా భారత్ బంద్

పోలవరం రూరల్: ఎస్సీల మధ్య చిచ్చు పెట్టేందుకే వర్గీకరణ చేశారని మాల మహానాడు నాయకులు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ రాష్ట్రాలు చేసుకోవచ్చని ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని బుధవారం పోలవరంలో బంద్‌ను వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కార్యదర్శి సొబ్బన మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బంద్ ప్రశాంతంగా జరిగింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలవరం సీఐ జి.మధుబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్‌లు సిబ్బందితో పటిష్ట బందోబస్తు చేపట్టారు. బచ్చల వెంకటరమణ, రామ్మోహన్ పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో

ద్వారకాతిరుమల: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాలల ఐక్యత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన భారత్ బంద్ మండలంలో ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం మండల కేంద్రమైన ద్వారకాతిరుమలలో మాల మహానాడు ఏలూరు జిల్లా అధ్యక్షులు మానుకొండ రాజశేఖర్ ఆధ్వర్యంలో పలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీబీఎస్ఎస్ మండల అధ్యక్షుడు గోటూరి శేఖర్, అంబేద్కర్ సేవా సంఘం ఉపాధ్యక్షుడు పొంగులేటి నాగేశ్వరరావు, లక్కాబత్తుల అనిల్, అంబేద్కర్ సేవా సంఘం కార్యదర్శి ఉర్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో

కుక్కునూరు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహా ఐక్య వేదిక నాయకుల పిలుపు మేరకు నిర్వహించిన భారత్‌బంద్ బుధవారం మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మాల మహా ఐక్య వేదిక నాయకులు కుక్కునూరులో ర్యాలీ నిర్వహించారు. బొంతు వెంకటేశ్వర్లు, కురాకుల బాబురావు, నాచుపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో

కొయ్యలగూడెం: ఎస్సీ వర్గీకరణకు ఒప్పుకోమని, కోర్టు తీర్పును పార్లమెంటు అమలు చేయకూడదని మాల సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో బుధవారం భారత్ బంద్‌ను నిర్వహించి, ఆందోళన, రాస్తారోకో కార్యక్రమాలు నిర్వహించారు. అంబేద్కర్ సేవా సంఘాలు, మాల మహానాడు, నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడిలో

చింతలపూడి: ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చునని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాలల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం తలపెట్టిన బంద్ చింతలపూడిలో విజయవంతం అయ్యింది. జేఏసీ నాయకులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ప్రకారం రాజ్యాంగ సవరణ చేయకుండ ఎస్సీ వర్గీకరణ సరైన పద్ధతి కాదన్నారు. భవిష్యత్తులో వర్గీకరణకు వ్యతిరేక పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.